"ప్రజలారా! నేనేం చెప్పబోతున్నానో మీకు తెలుసా?"

"కొందరికి తెలుసు, కొందరికి తెలీదు." జవాబు చెప్పారు ప్రజలు.

"సరే అయితే. ఎవరికైతే తెలుసో వారు తెలీని వాళ్ళకి చెప్పండి." అని నసీరుద్దీన్ వేదిక దిగి వెళ్ళిపోయాడు.

ఇతరులని ఉద్ధరించాలనుకుని ప్రవచనాలతో సమయాన్ని వృధా చేసుకోకుండా, దైవ ధ్యానం చేసుకుంటూ ఎవరిని వారు ఉద్ధరించుకోవాలని నసీరుద్దీన్ ఇలా అనేక చర్యల ద్వారా సదా చెప్పేవాడు.

## 95. బానిస- భక్తుడు

దైవ భక్తి పరుడైన ఓ ధనవంతుడు ఓ బానిసని కొనుక్కున్నాడు. అతన్ని ఇంటికి తెచ్చాక అడిగాడు.

"నీ పేరేమిటి?"

"మీరు ఏ పేరుతో పిలిస్తే నా పేరు అదే దొర." వినయంగా జవాబు చెప్పాడు ఆ బానిస.

"నువ్వు రోజూ ఏం తింటావు?" అడిగాడు మళ్ళీ.

"మీరేం పెడితే అదే తింటాను దొరా."

"నీకు ఎలాంటి దుస్తులు ధరించాలని కోరికగా ఉంటుంది?"

"మీరేం దుస్తులు ఇస్తే వాటినే ధరించాలని ఉంటుంది దొర."

"సరే. నువ్వేం పని చేస్తావు?"

"మీరేం పని చెప్తే అది చేస్తాను దొర."

"సరే. నీకేమైనా కోరిక ఉంటే చెప్పు. అది నేను తీరుస్తానని మాట ఇస్తున్నాను." అడిగాడు ధనవంతుడు.

తనని బానసత్వం నించి విముక్తి చేయమని కోరతాడనుకుని ఎదురు చూసిన అతనికి, ఆ బానిస ఎదురు ప్రశ్న విని ఆశ్చర్యం కలిగింది.

"బానిసకి కోరికంటూ ఉంటుందా దొరా?"

వెంటనే ఆ ధనవంతుడు ఆ బానిసని కౌగలించుకుని చెప్పాడు.

"భలే! తన భక్తుడు ఎలా ఉండాలని దేవుడు కోరుకుంటాడో నీ జవాబుల ద్వారా నువ్వు నాకు నేర్పించావు."

అతడ్ని బానిసత్వం నించి విముక్తుడ్ని చేసి, స్వంత వ్యాపారం చేసుకోడానికి కొంత ధనం కూడా ఇచ్చాడా ధనవంతుడు.

నిజమైన భగవత్ భక్తుడికి వ్యక్తిగతమైన కోరికలు, ఇష్టాలు అంటూ ఏమీ ఉండవు.

## 96. నిన్ను బట్టే ప్రపంచం

ఒకతను ఓ కొత్త వూళ్ళో రైల్వే స్టేషన్‌లో రైలు దిగి బయటకి వచ్చాడు. ఎదురుగా ఓ బస్ స్టాప్ పక్కనే కిళ్ళీకొట్టు కనపడింది. అతను సిటి బస్ కోసం ఆగి, అక్కడున్న కిళ్ళీకొట్టు వాడిని అడిగాడు.

"ఈ వూరు ఎలాంటిది? ఇక్కడి ప్రజలు ఎలాంటి వారు?"

"మీ వూళ్ళోని ప్రజలు ఎలాంటివారు?" ఎదురు ప్రశ్న వేసాడు కిళ్ళీకొట్టు వాడు.

"మా వూరు వాళ్ళు అంత మంచివారు కాదు. చాలా అధర్మంగా ప్రవర్తిస్తారు." జవాబు చెప్పాడు అతను.

"ఈ వూళ్ళో వాళ్ళు కూడా అంతే." జవాబు చెప్పాడు కిళ్ళీకొట్టు వాడు.

అదే రైల్లోంచి దిగిన మరో కొత్త వ్యక్తి కూడా అక్కడికి వచ్చి నిలబడ్డాడు. కొద్దిసేపాగి అతను కూడా కిళ్ళీ కొట్టువాడిని అడిగాడు.

"ఈ వూరు ఎలాంటిది? ఇక్కడి ప్రజలు ఎలాంటి వారు?"

"మీ వూళ్ళోని ప్రజలు ఎలాంటివారు?" మళ్ళీ ఎదురు ప్రశ్న వేసాడు కిళ్ళీకొట్టు వాడు.

"మా వూరు వాళ్ళు బాగా మంచివారు. చాలా ధర్మంగా ప్రవర్తిస్తారు." జవాబు చెప్పాడు అతను.

"ఈ వూళ్ళోని వాళ్ళు కూడా అంతే."

జవాబు చెప్పాడు కిళ్ళీకొట్టు వాడు.